విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

99492 22450

ప్రభాత సూర్య
www.suryaa.news



# ప్రభాత సూర్య

PRABHATA SURYA

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

హైదరాబాద్
7-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 185

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# బీర్లు తెగ తాగేస్తున్నారు..!!

### రాష్ట్రంలో భారీగా పెరిగిన బీర్ల విక్రయాలు

### గత ఐదేళ్ల రికార్డులు తిరగరాసేలా అమ్మకాలు

- ఫిబ్రవరిలోనే 38 లక్షల కేసులు ఖాళీ
- ఈ నెల మొదటి 4రోజుల్లోనే 8లక్షల కేసులు ఖతమ్
- డిమాండ్ ను ముందుగానే పసిగట్టిన కంపెనీలు
- గతేడాది కన్నా భారీగా బీర్ల ఉత్పత్తి పెంపు
- 35 రోజులకు సరిపడా ముందస్తు స్టాక్ సిద్ధం

వేసవికాలం.. మండే ఎండలు.. కళ్లెదురుగా చల్లటి బీరు. ఇంకేముంది.. లాగించేయడమే.. సేద దీరడమే. ఔను.. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి అలాగే ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా బీర్లు తెగ తాగేస్తున్నారు. దీంతో బీర్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ఎండకాలం ప్రారంభం దశలోనే ఈ ఏడాది బీర్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. గత ఐదేళ్ల రికార్డులను 2024లో జరిగిన బీర్ల అమ్మకాలు తుడిచిపెట్టేశాయి.

(హైదరాబాద్, ప్రభాత సూర్య)



# ఖమేనీ బంకర్ ధ్వంసం

## 50 యుద్ధ విమానాలతో దాడి చేశామన్న ఇజ్రాయెల్

## అది సైనిక మిలిటరీ కమాండ్ సెంటరని వెల్లడి

- భారీగా ఇజ్రాయెల్, అమెరికా దాడులు
- తీవ్రస్థాయిలో ఇరాన్ ప్రతి దాడులు
- తీవ్రత మరింత పెంచుతాం: ట్రంప్
- ఇరాన్‌తో ఎలాంటి ఒప్పందాలూ ఉండవ్
- బేషరతుగా లొంగిపోవాల్సిందేనన్న అధ్యక్షుడు
- తగ్గేదే లేదు.. భూతల దాడులకూ సిద్ధం: ఇరాన్



# ప్రజల మద్దతుతో పాలన సాగిస్తున్నాం

## మీ అందరి మద్దతుతనే గెలిచాం

## మాటలు, మూటలతో గెలిచి రాలేదు

### మా వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదు

### వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మద్దుతగా నిలిచా

### మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో రేవంత్ రెడ్డి

చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు.



**హైదరాబాద్,ప్రభాత సూర్య :** ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. తమది పేదల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు.

# సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల టాప్

- ర్యాంకర్‌గా శ్రీజశ్వంత్‌చంద్ర..55వ ర్యాంకు సాధించిన పెద్దపల్లికి చెందిన సృజన
- జోధ్‌పూర్ ఎంబీబీఎస్ వైద్యుడు అనూజ్ అగ్నిహోత్రికి ఫస్ట్ ర్యాంక్
- చెన్నైకి చెందిన రాజేశ్వరి సువేకు రెండో ర్యాంక్..
- ఢిల్లీవాసి ఆకాన్ష్ ధుల్‌కు మూడో ర్యాంక్
- సివిల్స్--2025 తుది ఫలితాలు విడుదల చేసిన యూపీఎస్సీ



హైదరాబాద్: సివిల్స్--2025 ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి ఏపీలోని కాకినాడకు చెందిన జీను శ్రీజశ్వంత్‌చంద్ర ఆలిండియా 23వ ర్యాంక్ సాధించగా తెలంగాణలోని పెద్దపల్లికి చెందిన గూడెల్లి సృజన 55వ ర్యాంకు సాధించారు. తెలంగాణకు చెందిన 20 మందికి వెయ్యిలోపు ర్యాంకులు లభించాయి. ఈ మేరకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శుక్రవారం తుది ఫలితాలను విడుదల చేసింది.



## అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు


- వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి
- సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ




## ప్రజలను ఏమార్చే పాలన

- రెండేళ్లుగా అదే చేస్తున్నారు
- మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం
- గతంలో ఇచ్చిన దరఖాస్తులకే దిక్కులేదు
- 99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీష్ రావు

## 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్




- సోషల్ మీడియాతో పిల్లలు నష్టపోవడానికి వీల్లేదు
- అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- 25 నూతన పాలసీలతో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 3 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం
- అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో సిఎం బాబు



## అయోధ్యలో అమితాబ్ భూమి కొనుగోలు

### రూ.35 కోట్లతో 2.67 ఎకరాల భూమి సేకరణ

**అయోధ్య, ప్రభాత సూర్య :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక నగరం అయోధ్యలో బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ భారీ పెట్టుబడి పెట్టారు.



## ఎనుమాముల మార్కెట్లో మిర్చి రాసులు

### భారీగా తరలి వచ్చిన బస్తాలు

# ప్రజల మద్దతుతో పాలన సాగిస్తున్నాం

తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. కర్ణుడి మాదిరిగా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం



రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు సీఎం రేవంత్ హితవు పలికారు. తెలంగాణలో ఆర్థిక సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు.ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని తెలంగాణ సీఎం తెలిపారు.

మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు తెలియవా?.. వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు కాచుకోవాలా?.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలుతారా? అంటూ ఆ పార్టీ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, ఎంపి కడియం కావ్య, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ఎనుమాముల మార్కెట్లో మిర్చి రాసులు

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు భారీగా మిర్చి రావడంతో మార్కెట్ ఎరుపెక్కింది. వరుసగా రెండ్రోజుల నుంచి సుమారు 35 నుంచి 40వేల బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. ఈ సీజన్‌లో ఇదే అధికం. దీంతో యార్డులో ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శన మిచ్చాయి. మిర్చి ధరలు గత సంవత్సరంతో పోలిస్తే మెరుగ్గా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మార్కెట్‌లో మంచి నాణ్యత ఉన్న మిర్చికి గరిష్టంగా పలికిన ధరలు ఇలా ఉన్నాయి... తేజ రకం మిర్చి క్వింటాకు రూ.18,800, వండర్‌హాట్ రూ. 35వేలు, యూఎస్.341 రూ.21వేలు, దీపిక రూ. 30వేలు, ఎల్లోమిర్చి రూ.20 వేలు, సింగిల్‌పట్టి రూ.40వేలు, దేశీ మిర్చి రూ.40వేలు, తాలు క్వింటాకు రూ. 12వేలు పలికింది. ఇటీవల చపాట మిర్చి ధరలు బాగా పెరిగాయి. నాలుగు సంవత్సరాల తరువాత దేశీ మిర్చి ధరలు పుంజుకుంటున్నాయి. 2021-22లో మిర్చి ధరలు, ముఖ్యంగా దేశీ మిర్చి ధర క్వింటాకు లక్ష రూపాయల వరకు పలికింది. ఆ తరువాత గడిచిన నాలుగేళ్లుగా రూ.30వేల నుంచి రూ.40వేలు.. తేజ, వండర్‌హాట్, యూఎస్ 341 లాంటి రకాలకు రూ.12వేల నుంచి రూ.16వేలు పలికాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అనేక మంది రైతులు మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు.ప్రస్తుత సీజన్‌లో కొంత కాలంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. జియోట్యాగింగ్ కలిగిన దేశీ మిర్చికి విదేశాలలో మంచి డిమాండ్ ఉండడంతో ఎగుమతులు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మిర్చి ధరలు గరిష్టంగా ఉన్నాయి. గత నెల మొదటి వారంలో మిర్చి సీజన్ ప్రారంభం కాగా, తొలుత క్వింటాకు రూ.16,300 నుంచి రూ.16,800 వరకే సగటు ధరలు ఉన్నాయి.

## 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవద్దనే సంకల్పానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నారు. స్వప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చుని , దానికి బానిసై చెడుకు ఉపయోగిస్తే నాశనమవుతారని అన్నారు. 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని సూచన వచ్చిందని, వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని, 13-16 ఏళ్ల లోపు వారికి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు.రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పనిదినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు.

## అయోధ్యలో అమితాబ్ భూమి కొనుగోలు

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ హౌస్ ఆఫ్ అభినందన్ లోధా నుంచి రూ.35 కోట్లతో 2.67 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని కొనుగోలు చేశారు. సంబంధిత లావాదేవీని శుక్రవారం పూర్తి చేసినట్లు లోధా సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. అయోధ్యలో అమితాబ్ ఇప్పటికే పలు పెట్టుబడులు పెట్టారు. ఒక్క లోధా ప్రాజెక్ట్‌ల్లో మూడు చోట్ల, మొత్తంగా అయోధ్యలో నాలుగు చోట్ల పెట్టుబడులు పెట్టారు. అయోధ్య రామ మందిరానికి దగ్గర్లో లోధా సంస్థ అభివృద్ధి చేసిన సరయు ప్రాజెక్ట్‌లో 2024 జనవరిలో అమితాబ్ తొలుత స్థలం కొనుగోలు చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు దగ్గర్లోనే తాజాగా మరో స్థలాన్ని అమితాబ్ తాజాగా కొన్నారు. ఇది కాకుండా 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక ప్లాట్‌ను లోధా నుంచి గతంలో కొనుగోలు చేశారు. అమితాబ్ బచ్చన్ పెట్టుబడుల వెనుక దీర్ఘకాలిక వ్యూహం, అయోధ్యపై ఉన్న ఆయకున్న విశ్వాసాన్ని తెలియజేస్తున్నాయని లోధా గ్రూప్ ఛైర్మన్ అభినందన్ లోధా పేర్కొంది.

# బీర్లు తెగ తాగేస్తున్నారు..!!

అయితే, ఈ ఏడాది ఆ రికార్డును కూడా తిరగరాసేలా బీర్ల అమ్మకాలు జరుగుతున్నాయి.ఈ ఏడాది ఎండలు ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. కానీ, మధ్యాహ్నం మాత్రం భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో బీరు ప్రియులు చల్లటి బీర్లను వెతుక్కుంటూ వెళుతున్నారు. సాయంత్రమైందంటే చాలు.. వైన్స్ షాపుల వద్ద మద్యం కన్నా.. బీరు కొనుగోలు చేసేవారే ఎక్కువ మంది కనిపిస్తున్నారు. గత 15 రోజుల నుంచి బీర్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. గతేడాది కన్నా 36 శాతం మేర పెరిగి కొత్త రికార్డులను సృష్టించింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు, 1,205 బార్లు, 50కిపైగా క్లబ్బులు ఉండగా.. ఈ నెల మొదటి నాలుగు రోజుల్లోనే 8లక్షల కేసులకుపైగా బీర్ల విక్రయాలు జరిగాయి. ఈ పరిణామం రాష్ట్రంలో బీర్ల డిమాండ్‌ను తెలియజేస్తోంది. 2025 జనవరిలో 31లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది జనవరిలో అది 34 లక్షలకు పెరిగింది. ఇక, గత ఏడాది ఫిబ్రవరిలో 28 లక్షల కేసుల బీర్లు అమ్ముడవ్వగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ సంఖ్య ఏకంగా 38లక్షల కేసులకు చేరింది. అయితే ఎండలు ముదురుతుండటంతో ఫిబ్రవరి చివరి వారం నుంచి బీర్ల డిమాండ్ పెరిగిందని చెబుతున్నారు. 2025 మార్చిలో 31లక్షల కేసుల బీర్లు అమ్మగా.. ఈ సారి నాలుగు రోజుల్లోనే అందులో నాలుగో వంతు(8లక్షల కేసులు)ను చేరుకోవడం గమనార్హం. సూర్యప్రతాపం




పెరిగే కొద్దీ ఈ అమ్మకాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్‌శాఖ అంచనా వేస్తోంది. వాస్తవానికి ప్రతి ఏడాది బీర్ల అమ్మకాలు 450 లక్షల కేసుల నుంచి 500 లక్షల కేసుల వరకు జరుగుతాయి. ఈ ఏడాది మొత్తం మీద సాధారణ అమ్మకాల కంటే 15- 20 శాతం అదనంగా అమ్మకాలు జరగవచ్చునని అంచనా వేస్తున్నారు.

ఉత్పత్తి పెంచిన కంపెనీలు... ముందస్తు నిల్వలు

రాష్ట్రంలో బీర్ల డిమాండ్‌ను తయారీ కంపెనీలు ముందుగానే పసిగట్టాయి. అందుకు తగ్గట్టుగానే తమ ఉత్పత్తిని పెంచాయి. గత ఏడాదితో పోల్చితే 10 శాతం నుంచి 12 శాతం అదనపు ఉత్పత్తి సాధించేలా ఎక్సైజ్‌శాఖ చర్యలు చేపట్టింది. సాధారణంగా వేసవి కాలంలో గోదాముల్లో 15 రోజులకు సరిపడా బీర్ల స్టాక్ ఉంచుతారు. కానీ, ప్రస్తుత డిమాండ్ దృష్ట్యా ఏకంగా 35 రోజులకు సరిపడా నిల్వలను గోదాముల్లో ఉంచారు. అలాగే, బీర్ల ఎగుమతులపై కూడా ఎక్సైజ్ శాఖ ఆంక్షలు విధించింది. వాస్తవానికి ఏ కంపెనీ అయినా రాష్ట్ర సరఫరా కోటాను పూర్తి చేశాక.. మిగిలిన సరుకును ఇతర రాష్ట్రాల్లో అమ్ముకునే వెసులుబాటు ఉంది. కానీ, ఈ సారి డిమాండ్ అధికంగా ఉండడంతో ఇతర రాష్ట్రాలకు చేసే బీర్ల ఎగుమతులను ఎక్సైజ్ శాఖ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న బీర్ల అమ్మకాల వేగాన్ని చూస్తుంటే.. మే నెల నాటికి బీర్ల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఇప్పటి నుంచే ముందు జాగ్రత్తగా పత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఏది ఏమైనా.. ఈ పరిణామం మాత్రం ఎక్సైజ్ శాఖకు, తద్వారా ప్రభుత్వ ఖజానాకు శుభసూచకంగానే సర్కారు భావిస్తోంది. సాధారణంగా ప్రభుత్వ ఖజానాకు అత్యధిక రాబడిని తీసుకొచ్చేది ఎక్సైజ్ శాఖేనన్నది తెలిసిన విషయమే. అయితే కొన్ని పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మాత్రం ఊహించిన దానికన్నా ఎక్కువ రాబడి ఎక్సైజ్ శాఖకు ఉంటుంది. కానీ, ఈసారి మాత్రం ఎండల కారణంగా బీర్ల అమ్మకాల ద్వారా గత రికార్డులన్నింటినీ బద్దలు కొడుతుండడంతో ఆ శాఖ అధికారులు తెగ సంబర పడిపోతున్నారు.

## ఖమేనీ బంకర్ ధ్వంసం

దుబాయ్/బీరూట్: పశ్చిమాసియాలో కల్లోల తీవ్రత ఏ మాత్రమూ తగ్గడం లేదు. ఏడో రోజైన శుక్రవారం కూడా ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా భారీ స్థాయిలో దాడులు కొనసాగించాయి. నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలను ప్రధానంగా లక్ష్యం చేసుకున్నాయి. ఇరాన్‌వ్యాప్తంగా క్షిపణులు, బాంబుల వర్షం కురిసింది. దాడుల తీవ్రతను ఇకపై మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు ఘాటు హెచ్చరికలు చేశారు. ఆ దేశంతో ఎలాంటి ఒప్పందాలూ, చర్చలూ ఉండబోవని స్పష్టం చేశారు. “బేషరతుగా లొంగిపోవాలి. వారి ముందున్న మార్గం అదొక్కటే”అంటూ కుండబద్దలు కొట్టారు. ఇరాన్ మాత్రం ఏ మాత్రమూ వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని పేర్కొంది. భూతల దాడులకు కూడా తాము అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రకటించారు. రాజధాని టెహ్రాన్ నడి‘డ్డున దివంగత సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీకి చెందిన రహస్య భూగర్భ బంకర్‌ను బాంబు దాడులతో తుత్తునియలు చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. “రహస్య భేటీలతో పాటు యుద్ధం వంటి క్లిష్ట పరిస్థితుల్లో సమన్వయం, పర్యవేక్షణ తదితరాల కోసం ఖమేనీ ఈ బంకర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. 50 యుద్ధ విమానాలతో దానిపై విరుచుకుపడ్డాం. నామరూపాల్లేకుండా ధ్వంసం చేసేశాం”అని ఇజ్రాయెల్ సైన్యం ఐడీఎఫ్ పేర్కొంది. ఖమేనీ హత్యానంతరం ఆ బంకర్ సీనియర్ కమాండర్లకు బేస్‌గా ఉపయోగపడుతున్నట్టు సమాచారం. గురువారం రాత్రంతా గుక్కతిప్పుకోకుండా జరిగిన దాడులతో టెహ్రాన్ అల్లాడిపోయింది. ఎక్కడ చూసినా భారీగా దుమ్ము, పొగ ఆకాశాన్నంటుతూ కని?పస్తున్నాయి. కీలకమైన క్షిపణి నిల్వ కేంద్రాలున్న కెర్మెన్‌షాపైనా తీవ్రస్థాయిలో దాడులు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున అమెరికా బీ--2 స్టెల్త్ బాంబర్ విమానాలు ఒక్కోటీ 2,000 పౌండ్ల బరువుండే పెనెట్రేటర్ బాంబులను డజన్ల కొద్దీ జారవిడిచాయి! అనంతరం ఉదయం వేళ టెహ్రాన్‌లో పలుచోట్ల భారీ పేలుళ్లు వణికించాయి. దేశవ్యాప్తంగా మృతుల సంఖ్య 1,300 దాటినట్టు ప్రభుత్వం పేర్కొంది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపైనా దాడులను ఇరాన్ ముమ్మరంగా కొనసాగించింది. జెరూసలేం, టెల్ అవీవ్‌తో పాటు పలు నగరాల్లో ప్రజలు భారీ సంఖ్యలో బంకర్లలో తలదాచుకుంటున్నారు.

## ప్రజలను ఏమార్చే పాలన

కాక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దరఖాస్తులకు దిక్కు లేదు కానీ, మళ్లీ ఇప్పుడు పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గు చేటని అన్నారు. రెండున్నరేండ్లలో అసలు ఏం చేసారని ప్రచారం నిర్వహిస్తున్నారు. రేవంత్ రెడ్డి గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి మీ పైఫల్యాలు ప్రచారం చెప్పుకుంటారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాక్షన్ ప్లాన్ పేరిట పాలనా వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకు డైవర్షన్ ప్లాన్ డ్రామాకు తెర తీశారని ధ్వజమెత్తారు. ప్రచార కోసమేనని, ప్రజలకు ఒరిగేదేమి లేదని అన్నారు. 800 రోజుల పాలనలో చేసిందేం లేక, 99 రోజు ప్రణాళిక పేరిట రేవంత్ రెడ్డి మరో డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు.రెండున్నరేండ్ల పాలన తర్వాత ప్రగతి ప్రణాళికలు గుర్తుకు వచ్చాయా?అంటూ నిలదీశారు.అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలన వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాంలు, ప్రజల ఛీత్కారాల నుంచి దృష్టి మరల్చేందుకు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మరో డైవర్షన్ ఎ÷--లాన్ అని విమర్శించారు. కోతల సమయం వచ్చినా ఈ సీజన్ ఇప్పటి వరకు రైతు భరోసా దిక్కు లేదు.గత సీజన్ పంట బోనస్ ఇవ్వక చేతులెత్తేసారు. చివరకు యూరియా కూడా సరఫరా చేయలేక రైతులను నడిరోడ్డు మీదకు ఈడ్చారు.నమ్మించి గొంతు కోసిన ఈ మోసాల గురించి రైతులకు వివరిస్తారా? చెప్పాలని డిమాండ్ చేశారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అని ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక యువతను మోసం చేశారు. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేశారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా మూసీ బ్యుటిఫికేషన్ పేరిట లూటీకి తెగబడ్డారు. రాజీవ్ యువ వికాసం పేరిట తీసుకున్న దరఖాస్తులు దిక్కు లేకుండా పోయాయని హరీష్‌రావు విమర్శించారు. యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం అంటూ కొత్త పాట పాడుతున్నారని దుయ్యబట్టారు .

## అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే జాతీయ రహదారులతో అనుసంధానించామని.. ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.265 కోట్ల వ్యయంతో ఔఊ163 (గతంలో ఔఊ-202) మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల్గ ÷÷-ల ఓవర్‌ను నిర్మించిందని గుర్తుచేశారు.

# సోను సూద్ ఫౌండేషన్ అభాగ్యులకు అండ ?

ఫౌండర్ బుద్ధారం శివకుమార్ ● సోను సూద్ స్ఫూర్తితో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన సోను సూద్ శివ , మనోహర్ సమాజ సేవక్



**మహబూబ్నగర్, మార్చి 06(ప్రభాత సూర్య ):** సోను సూద్ సార్ వృత్తిపరంగా నటుడు, ప్రవృత్తి పరంగా సమాజ సేవకుడు. కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో సోనూసూద్ సార్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. అదే సమయంలో సోనుసూద్ సార్ ని స్ఫూర్తిగా తీసుకొని ఎటువంటి సమయంలో అయినా మేమున్నామని భరోసాని ఇస్తూ మా దృష్టికి వచ్చిన ప్రతి ఒక్కరికి సహాయం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్న మహబూబ్నగర్ సోను సూద్ శివ. సోను సూద్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఎంతో మందికి సేవలు చేస్తూ స్థానికుల మన్ననలను పొందిన సోను సూద్ శివ నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తి అని పలువురు ప్రశంసించారు."రక్తం దొరకక ఏ ఒక్కరు కూడా చనిపోకూడదని ఈ సోను సూద్ ఫౌండేషన్ ప్రారంభించడం జరిగింది". ఒక్కరు రక్తదానం చేయడం ద్వారా ముగ్గురు ప్రాణాలు నిలబడుతాయని అందరికీ అవగాహన కల్పిస్తూ ఎంతోమంది యువతి యువకుల ద్వారా సరైన సమయంలో రక్తదానం చేపించి ఎంతోమంది ప్రాణాలు కాపాడటం జరిగింది. రోడ్ల పైన మతిస్థిమితం లేని వ్యక్తులకి ఎంతో మందికి కటింగ్ స్నానం చేపించి కొత్త బట్టలు ఏపించడం జరిగింది. అలాగే అనేక సందర్భంలో అన్నదానం చేయడంతో పాటుగా గవర్నమెంట్ హాస్పిటల్ లో గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. కరోనా లాక్డౌన్ సమయంలో కరోనా అనే మహమ్మారి సోకి ఎంతో మంది చనిపోయారు ఆ సమయంలో సొంత కుటుంబ సభ్యులు కూడా ముందుకు రాలేకపోయారు అటువంటి పరిస్థితుల్లో సోనూ సూద్ ఫౌండేషన్ ముందుకు వచ్చి చనిపోయిన వారికి వారి కుల సంప్రదాయాల ప్రకారం సొంత ఖర్చులతో అంత్యక్రియలు చేయడం జరిగింది.

**ఇలాంటి మరి ఎన్నో సేవ కార్యక్రమాలు**

చెయ్యడానికి ఎల్లప్పుడు మా సోనూ సూద్ ఫౌండేషన్ సభ్యులమందరము కృషి చేస్తూనే ఉంటాము. అదేవిధంగా గత ఆరు సంవత్సరాల నుంచి ఆ మహానుభావుని కలవాలన్న ఎన్నో రోజుల కలను నిజం చేసినటువంటి టీ.పి.సి.సీ జనరల్ సెక్రెటరీ ఏపీ. మిథున్ రెడ్డి అన్నకి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాము. ఈ సందర్భంలో సోనుసూద్ సార్ మాట్లాడుతూ ఇకనుంచి మీకు అన్నివేళలా నేను సహాయ సౌకర్యాలు అందిస్తానని చెప్పి మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో సోనుసూద్ ఫౌండేషన్ ఫౌండర్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మహబూబ్నగర్ జిల్లా యూత్ అధ్యక్షులు సోనుసూద్ శివ, సోను సూద్ ఫౌండేషన్ వాయిస్ ప్రెసిడెంట్ మరియు తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మహబూబ్నగర్ జిల్లా యూత్ కార్యదర్శి సి. మనోహర్ సమాజసేవక్, జనరల్ సెక్రెటరీ,గుమ్మడాల కిషోర్ గౌడ్,జాయింట్ సెక్రెటరీ, అబ్దుల్ ముబారక్, తదితరులు పాల్గొన్నారు....



# ట్విట్టర్ ఫిర్యాదుతో కదిలిన అధికారులు

## అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీ సమస్యకు తాత్కాలిక పరిష్కారం

**పఠాన్ చెరువు మర్చి 6 ప్రభాత సూర్య :** పటాన్చెరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో డ్రైనేజీ ఉప్పొంగి రోడ్డుపైకి, ఇళ్లలోకి ప్రవహిస్తున్న సమస్యపై స్థానికులు చేసిన ఫిర్యాదుతో ఎండీఆర్ ఫౌండేషన్ స్పందించింది. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఈ ఫిర్యాదుపై అధికారులు స్పందించి వెంటనే సిబ్బందిని పంపించి డ్రైనేజీ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. దీంతో కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులకు ఉపశమనం లభించింది. అయితే ఈ సమస్య తరచూ ఎదురవుతుందని స్థానికులు వాపోతున్నారు. గతంలో డ్రైనేజీ పనులు చేపట్టేటప్పుడు స్థాయిలను సరిగా పరిశీలించకపోవడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. ఇకపై ఈ సమస్య మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. తమ సమస్యను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎండీఆర్ ఫౌండేషన్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే ఎండీఆర్ ఫౌండేషన్ సేవలను వారు అభినందించారు.

# నూతన హోటల్ ను ప్రారంభించిన సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి

**వలిగొండ మార్చ్ 06,(ప్రభాత సూర్య):** వలిగొండ పట్టణ కేంద్రంలో నూతనంగా నెలకొల్పిన భోజన టిఫిన్ హోటల్ ను స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలిగొండ మండల కేంద్రం మీదుగా ఎంతోమంది ప్రయాణికులు ప్రయాణం చేస్తూ ఉంటారు వారికి నాణ్యమైన భోజన సదుపాయాన్ని కల్పించి నాణ్యమైన ఆహారాన్ని భోజన ప్రియులకు అందించాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తిని సహదేవ్ గౌడ్, కాసుల వెంకన్న, బత్తిని లింగయ్య, బందారపు లింగస్వామి, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు కొండూరు అజయ్ కుమార్ గౌడ్, మారగోని నరసింహ, బెలిదే నాగేశ్వర్ , పోలెపాక జానకి రాములు ,కొండూరు సాయి, తదితరులు పాల్గొన్నారు.





# ఇఫ్తార్ లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**మిర్యాలగూడ , మార్చి 6:-( ప్రభాత సూర్య) :** మిర్యాలగూడ నియోజకవర్గ ఇందిరమ్మ కాలనీ మదీనా మస్జిద్ లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ, ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ కేతావత్ శంకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇబ్రహీం ముస్లింలు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో

# ప్రైవేట్ బిల్లు పెట్టాలి

నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం అవకాశం కల్పించాలనీ ఏఐసీసీ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్ కి విజ్ఞప్తి చేసిన

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్



**మాడుగుల పల్లి ప్రభాత సూర్య (మార్చి 6) ప్రతినిధి:** జనాభా దామాషా ప్రకారం బీసీలకు రావలసిన వాటా దక్కనీయకుండా రాష్ట్రంలో కొంతమంది అడ్డుపడుతున్నారని ఈ యొక్క విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఈరోజు ఏఐసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్ గారిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్లో ప్రైవేట్ బిల్లు పెట్టాలని అంతేకాకుండా నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం అవకాశం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసినటువంటి బీసీలకు కాకుండా పార్టీలు మారి వచ్చిన అగ్రకులాలకు అగ్ర తాంబూలం కేటాయిస్తూ కార్పొరేషన్ చైర్మన్లు కేటాయిస్తున్నారని పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీని నమ్ముకున్న బీసీలకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నారని ఎఐసిసి ఓబిసి డిపార్ట్మెంట్ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్ కు వివరించారు.



## కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**మిర్యాలగూడ , మార్చి 6:-( ప్రభాత సూర్య):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా మార్చి 6 నుండి ప్రారంభమై జూన్ 12 వరకు 99 రోజుల పాటు అమలు చేయనున్న కార్యక్రమాన్ని కె.ఎన్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి, నోడల్ అధికారి పి. నాగరాజు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ భీమార్జునరెడ్డి మాట్లాడుతూ మొదటి పదిరోజుల పాటు నేటి నుండి 15 వరకు ప్రణాళికను తయారు చేసుకొని, కమిటీల ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్థామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విధానాలు ప్రజలకు చేరువ కావడంతో పాటు కళాశాలలు, విద్యాసంస్థల్లో సేవలను మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, శుభ్రతా కార్యక్రమాలను నిర్వహించడం, పెండింగ్ ఫైల్స్, పరిపాలనా పనులను త్వరగా పూర్తి చేయడం, కళాశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేసి విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఎన్సిసి, ఎన్ఎస్ఎస్. విద్యార్థులు కళాశాల ఆవరణను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్. ప్రోగ్రాం అధికారులు శ్రీనివారావు, స్వప్న , ఎన్సిసి సిటిఒ. నరేష్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న కవిత దంపతులు

## నలుగేళ్ల మనోవేదనకు తెరపడిందని ఆనందం



తిరుమల,మార్చి6: నాలుగేళ్లుగా తాను పడుతున్న మనోవేదన వేంకటేశ్వరస్వామి దయతో తీరిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తిరుమల శ్రీవారిని ఆమె దర్శించుకున్నారు. తన భర్తతో కలిసి శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. దిల్లీ మద్యం కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించేందుకు కాలినడకన వచ్చానన్నారు. త్వరలో తెలంగాణలో రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు వెల్లడించారు. తనకు కష్టకాలంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్వామి దయ తనపై ఉండడం వల్లనే కేసు నుంచి బయటపడ్డానని అన్నారు.

# రైల్వే ట్రాక్ విస్తరణపై బండ్లగూడ ప్రజల్లో ఆందోళన

పేదల ఇళ్లకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ భరోసా





**పఠాన్ చెరుమర్చి 6 ప్రభాత సూర్య :** మండలం లోని బండ్లగూడ ప్రాంతంలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ మార్గం పునరుద్ధరణ పనుల భాగంగా రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా 50 మీటర్ల పరిధిలో ఉన్న కట్టడాలను తొలగించాల్సిందిగా రైల్వే శాఖ సర్వే నిర్వహించింది. ఈ పరిణామంతో అక్కడ ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న స్థానిక ప్రజలు తమ ఇళ్లు కోల్పోతామేమోనన్న భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సందర్భంగా పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ మొత్తం 30 ఇళ్లలో రైల్వే మార్గం ఏర్పడకముందు నిర్మించినవి 15 ఇళ్లు, రైల్వే నిర్మాణం తర్వాత నిర్మించినవి 15 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా 50 మీటర్ల పరిధిలో ఉన్న తమ ఇళ్లను తొలగిస్తారన్న ఆందోళన ప్రజల్లో ఉందని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం పేదలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. అలాగే స్థానిక ప్రజలతో మాట్లాడిన ఆయన తమ గృహాల విషయంలో భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ట్రాక్‌కు ఇరువైపులా 50 మీటర్ల పరిధిలో ఉన్న కట్టడాలను తొలగించాలన్న దక్షిణ మధ్య రైల్వే నిర్ణయంపై ప్రజలు తమ సొంత ఇళ్లు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని గౌరవ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని మరియు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన అధికారిని కలిసి అభ్యర్థిస్తామని తెలిపారు. రైల్వే మార్గానికి సమీపంలో ఉన్న ఇళ్లు కోల్పోకుండా చూడాలని కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. తదుపరి బండ్లగూడలో మున్సిపల్ నిధులతో సుమారు 45 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న కొత్త సిమెంట్ రహదారి పనులను పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అంతర్గత కాలువ వ్యవస్థ సక్రమంగా లేదని, ఓపెన్ కాలువగా ఉందని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖను కోరారు. అనంతరం ఇంజనీరింగ్ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని కాలువ పనులను ప్రారంభించారు.



## భారతీ నగర్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



పఠాన్ చెరువు, మార్చి 6 ప్రభాత సూర్య: మండలం లోని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎం.ఐ.జి కాలనీలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారతీ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. విద్య, ఉపాధి మరియు సామాజిక రంగాల్లో మహిళలు మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాణి యాదవ్, విజయ, స్వర్ణ జ్యోతి, లత, విజయలక్ష్మి, అరుణ జ్యోతి, సునీత, రాధ, గాయత్రి, తార, చైతన్య తదితరులు పాల్గొన్నారు. కాలనీలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మిర్యాలగూడ మున్సిపాలిటీలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి







**మిర్యాలగూడ మార్చి 6:-(ప్రభాత సూర్య):** మిర్యాలగూడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ కోరారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శ్రీశ నవీన్ మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ లతో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతిఒక్కరు విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ఆదేశించిన ప్రణాళిక ప్రకారం అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తు పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కౌన్సిలర్లకు సూచించారు. అదేవిధంగా కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ పట్టణ కౌన్సిలర్స్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధి యెడల చిత్తశుద్ధి లేని పాలకులు

ఉత్సవ విగ్రహాలుగా యంఎల్ఏలు

పెండింగ్ ప్రాజెక్టులపై అసెంబ్లీలో నోరు ఇప్పండి

జిల్లాలో మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల వినియోగంపై డిపిఆర్ ను ప్రకటించాలి

మార్చి, ఏప్రిల్ ప్రజా పోరాట మాసాలు....

సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్




**భువనగిరి, మార్చి 06(ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా సమస్యలపై మార్చి 8 నుండి 31 వరకు ఇంటింటికి సిపిఎం ద్వారా సమస్యలు అధ్యయనం చేసి గ్రామీణ ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ తెలిపారు. శుక్రవారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో అనేక సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని రోజులు గడుస్తున్న పాలకులు మారుతున్న జిల్లా అభివృద్ధిలో మాత్రం పురోగతిలో లేదని అన్నారు. జిల్లా ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్న మౌలిక సమస్యలు ఎందుకు పెండింగ్ లో ఉన్నాయో జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం, సారవంతమైన భూములున్న సరైనా సాగు నీటి వసతులు లేక పంట భూములు బీళ్లు గా మారుతున్నాయని ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న బస్వాపురం ప్రాజెక్టు పనులు నిధులు లేక పూర్తి కావడం లేదని తెలిపారు. ఆలేరు ప్రాంతానికి సాగునీరు అందించే గంధమల్ల రిజర్వాయర్ కు సరిపోను నిధులు ఇచ్చి పనులు చేపట్టాలని సూచించారు. మునుగోడు ప్రాంతానికి జీవనాధారమైన డిండి ఎత్తిపోతలలో భాగమైన శివన్నగూడెం ప్రాజెక్టు పనులు, కాల్వల పనులు నిధుల లేమితో ముందుకు సాగడం లేదని తెలిపారు. ఎలాంటి సాగునీటి వసతులు లేని సంస్థాన్ నారాయణపురం మండలానికి రాచకొండ లిఫ్టు ఇరిగేషన్ ఎంతో అవసరమని అన్నారు. ఈ సమస్యలపై రైతాంగాన్ని ఏకం చేసి పోరాడుతామని తెలిపారు. బొమ్మలరామారం , తుర్కపల్లి , భువనగిరి , బీబీనగర్ మండలాలకు సాగునీరు అందించే శామీర్ పేట జలాశయాన్ని కొండపోచమ్మ నుండి గోదావరి జలాలతో నింపడం ద్వారా రెండు పటలకు నీరు అందుతాయని సూచించారు. అదేవిధంగా జిల్లా ఆరోగ్య రంగంలో కూడా వెనుకబడిందని పూర్తిస్థాయి వైద్యం అందడం లేదని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సరైన వసతులు, వైద్య పరికరాలు కూడా లేవని, ఎవరైనా డాక్టర్లు కూడా లేరని అన్నారు. రామన్నపేట, మోత్కూరు, ఆలేరు మండల కేంద్రంలో వంద పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామన్న హామీ హామీగానే మిగిలిందని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లావ్యాప్తంగా వైద్య రంగానికి తగిన నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల వైద్యం అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేటికీ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ , పీజీ, ఇంజనీరింగ్ కళాశాల, చౌటుప్పల్ లో డిగ్రీ కళాశాల లేక పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యాభివృద్ధికి ఈ బడ్జెట్లో తగిన నిధులు కేటాయించాలని కోరారు. దళిత వాడలు, గిరిజన తండాలు సమస్యలకు నిలయంగా మారాయని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని తెలిపారు. చిట్యాల, భువనగిరి ప్రధాన రహదారి వెడల్పు , ఆలేరు రెవెన్యూ డివిజన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులు పోరాడి సాధించిన ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్న ఉపాధి హామీ పనుల్లో కేంద్ర ప్రభుత్వం తన వాటా తగ్గించిందని తెలిపారు. అదేవిధంగా నూతన లేబర్ కోడ్ ద్వారా 8గంటల పని 12 గంటలు చేయడం, నూతన విద్యుత్, విత్తన సవరణ చట్టాల ద్వారా రైతాంగాన్ని, సామాన్యులను నిలువుగా ముంచే బిజెపి పాలనను ఎండగట్టాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు, మహిళలకు ప్రతినెల 2500 రూపాయలు, పెన్షన్ పెంపు, ఆడపిల్ల పెళ్లికి ప్రభుత్వం భరోసా, ఉద్యోగ కల్పన హామీలు నెరవేర్చలేదని ఈ సమస్యల సాధనకు ఏప్రిల్, మే మాసాల్లో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని జహంగీర్ తెలియజేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు పాల్గొన్నారు.

# గీతంలో రోబోటిక్స్, ఏఐ ల్యాబ్స్

## లాంఛనంగా ప్రారంభించిన మహీంద్రా సీనియర్ జీఎం అనిల్ కుమార్





పఠాన్ చెరువు మార్చి 6 ప్రభాత సూర్య : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లో రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) లాబొరేటరీని జహీరాబాద్ లోని మహీంద్రా & మహీంద్రా ఆటోమోటివ్ డివిజన్ ప్లాంటు అధిపతి, సీనియర్ జనరల్ మేనేజర్ (తయారీ) అనిల్ కుమార్ మహేంద్రకర్ శుక్రవారం ప్రారంభించారు. స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ ల్యాబ్ భావనను మహేంద్రకర్ ప్రశంసించడమే గాక, పారిశ్రామిక అనువర్తనాలతో విద్యాభ్యాసాన్ని అనుసంధానించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. నిపుణుల ఉపన్యాసాలు, ఆచరణాత్మక శిక్షణను అందించడానికి మహీంద్రా ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను కూడా ఇక్కడకు పంపుతామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. తమ పారిశ్రామిక ఉత్పత్తులను స్వయంగా పరిశీలించి, ఉత్పత్తి సంస్థను సందర్శించిన అనుభూతిని సొంతం చేసుకోవడానికి గీతం విద్యార్థులను తమ కర్మాగారాన్ని సందర్శించాలని ఆయన ఆహ్వానించారు. గీతంతో అంకురించిన అనుబంధాన్ని మహేంద్రకర్ గుర్తుచేసుకుంటూ, తమ ప్లాంట్ లో ఫ్యాకల్టీ ఇంటర్న్ షిప్ కోసం గీతం అధికారులు తమను సంప్రదించినప్పుడు, తొలుత ఒకింత విస్మయానికి గురయ్యామని చెప్పారు. రెండు బ్యాచులుగా గీతం అధ్యాపకులు తమ వద్ద శిక్షణ పొందారని, వారికి తమ పరిశ్రమపై లోతైన అవగాహన ఏర్పడడంతో పాటు, మెరుగైన విద్యా దృక్పథాలు వచ్చాయన్నారు. ఇది తమకు కూడా ఉపకరిస్తుందన్న విశ్వాసం వెలిబుచ్చారు. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, కోర్ ఇంజనీరింగ్ మాజీ డీన్ ప్రొఫెసర్ వి.ఆర్.శాస్త్రి, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి సమక్షంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. అంతర్ విభాగ అధ్యయనం, ఆవిష్కరణ, పరిశోధనల కోసం ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని వారు విద్యార్థులను ప్రోత్సహించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం స్థాపించిన ఈ ప్రయోగశాల, రోబోటిక్ వ్యవస్థల రూపకల్పన, ప్రోగ్రామింగ్, నిర్వహణలో విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడం ద్వారా రోబోటిక్స్, ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు, స్మార్ట్ తయారీలో ఆచరణాత్మక అభ్యాసం, పరిశోధనలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. శ్రీనివాస్, రోబోటిక్స్-ఏఐ లాబొరేటరీ ప్రొఫెసర్ ఇన్ ఛార్జి డాక్టర్ ఎ.కిరణ్ కుమార్ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సంయుక్తంగా సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సాంకేతిక ఆధారిత విద్య, పరిశ్రమ సంబంధిత నైపుణ్య అభివృద్ధికి గీతం యొక్క నిబద్ధతలో ఈ కొత్త సౌకర్యం మరో ముఖ్యమైన అడుగును సూచిస్తుంది.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం ఎక్కడైనా జరిగితే1098,100 కాల్ చేయండి



**మిర్యాలగూడ మార్చి 6:-(ప్రభాత సూర్య):** దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి వేములపల్లి మండలంలో సీడీపీఓ ఎస్.చంద్రకళ ఆదేశానుసారం వేములపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాల బాలికలకు సూపర్వైజర్ పరిమి రజిని సర్పంచ్ పుట్టల సందీప్ మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగరాదని బాల్యవివాహాలు జరిగినచో చట్టరీత్యా కేసు నమోదు అవుతుందని అందుకు చేసిన వారికి శిక్ష పడుతుందని జరిమానా విధిస్తారని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుందని తెలిసిన 1098కు 100కు కాల్ చేసి తెలపాలన్నారు. బాగా చదువుకొని పిల్లలు ఒక స్థాయిలో నిలబడిన తర్వాత అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తరువాత అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాత పెళ్లిళ్లు చేసుకోవాలన్నారు. తదుపరి బాల్యవివాహాలు వల్ల కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీ నిర్వహించి గెలుపొందిన నలుగురు పిల్లలకు సర్పంచ్ తో బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్వైజర్ పరిమి రజిని, సర్పంచ్ పుట్టల సందీప్, ఉప సర్పంచ్ గుండెబోయిన మల్లయ్య, హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ టీచర్స్ జయమ్మ, రజిత శశికళ, బాలబాలికలు పాల్గొన్నారు.

# ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ఎదగాలి





మిర్యాలగూడ ,మార్చి 6:-( ప్రభాత సూర్య) అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల తాళ్లగడ్డ లో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ మహిళా ఉద్యోగిని లు బాలికలకు ప్లేట్లు గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసి మహిళా ఉద్యోగులసంఘం నాయకులు పద్మజ మాట్లాడుతూ ఆడపిల్లలు ఏ విషయంలోనూ మగ పిల్లలతో తక్కువ కాదని, ఆత్మస్థైర్యంతో బాగా చదివి ఎదగడం ద్వారా సమాజంలో జీవితంలో ముందుకు సాగాలని అన్నారు. పాఠశాల హెడ్ మాస్టర్ వీరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ ధర్మానాయక్ చేతుల మీదుగా పాఠశాలలోని విద్యార్థినులందరికీ ప్లేట్లు, గ్లాసులు బహుకరించారు. ఈ సందర్భంగా మరో గ్రంథాలయ ఉద్యమ కారుడు,రచయిత కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ తాము చదువుకొని ఎదగడం ద్వారా సాధికారత సాధించిన వాళ్లుగా ఎల్ఐసి ఉద్యోగులు పేద విద్యార్థులకు మహిళా దినోత్సవ సందర్భంగా బహుమతులు అందించడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బివి పద్మజ, సుజాత, పద్మ స్వప్న, రోజలిన్, ఊర్మిళ, పాఠశాల ఉపాధ్యాయులు మనోహరి, జ్యోతి కల్పన తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

## నూతన పెట్రోల్ బంకు ను వైకుంఠ రథంమును ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బిర్ల





**వలిగొండ మార్చ్ 06(ప్రభాత సూర్య):** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. పేద వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా ప్రజలకు చేరేలా ఈ ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని పేర్కొన్నారు. త్రాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం,విద్యుత్ వంటి సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రజల సహకారంతో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు అనంతరం కొప్పుల వెంకట్ రెడ్డి మల్లేశం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన పెట్రోల్ బంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా మోటకొండూర్ ప్రజల సౌకర్యార్థం వైకుంఠ రథం బిర్లా ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. పేద ప్రజలు అంత్యక్రియల సమయంలో ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ సేవను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం బెడ బుడగ జంగాల కాలనీలో తూర్పాటి పార్వతమ్మ--వెంకట రామ య్య స్మారక కమ్యూనిటీ కార్యాలయం ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు ఫోరం అధ్యక్షు లు కొప్పుల వెంకట్ రెడ్డి స్థానిక సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, ఎంపిడిఓ ఇందిరా వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ సెక్రటరీ సంతోష్,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్





**తుర్కపల్లి ,మార్చి 6(ప్రభాత సూర్య):** తుర్కపల్లి మండలం వేల్పుపల్లి గ్రామంలోని కూరెళ్ళ పద్మ అశోక్ గౌడ్ నాగాయపల్లి తండలోని ధరావత్ మౌనిక ప్రవీణ్ నాయక్ ల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట ఇచ్చిన ప్రకారం లబ్ధిదారులకు పట్టు వస్త్రాలు, యాట పొట్టేలును అందజేసినట్లు తెలిపారు. పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చాలని లక్ష్యంతో ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నాయకత్వంలో ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నామని అన్నారు. ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదని, ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం లో నియోజకవర్గంలో 3500 ఇళ్లను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. రెండో విడత లో కూడా ఇండ్లను మంజూరు చేయనున్నట్టు తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇచ్చే బాధ్యత తనదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్క కుటుంబానికి అందజేయనున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయిన చైతన్య మహేందర్ రెడ్డి ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ ,సర్పంచులు కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి, రాజశేఖర్ ,గుండ సిద్దులు, భూక్య రాజారాం నాయక్ , కర్రె మాధవి కరుణాకర్ గౌడ్ ,గుగులోతు ధూప్ సింగ్ నాయక్ ,కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పనిగట్ల సుదర్శన్ గౌడ్ హౌసింగ్ ఏఈ నరేష్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# కూకడం గ్రామం లో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య



**మాడుగుల పల్లి // ప్రభాత సూర్య (మార్చి 6) ప్రతినిధి :** మాడ్గులపల్లి మండలం, కుక్కడం గ్రామం లో వ్యక్తి ఉరి వేసుకుని చనిపోయిన సంఘటన వివరాల్లోకి వెళితే ఆవుల మల్లేష్ తండ్రి జానయ్య, వయస్సు 41 సంవత్సరాలు, అనే వ్యక్తి గత కొంత కాలంగా తాగుడుకు బానిసై ఏమి పని చేయకుండా చీటికి మాటికి భార్య తో గొడవపడుతు గురువారం రోజున ఆమెను కొట్టగా, ఆమె (భార్య) పుట్టింటికి తన తల్లి గారిల్లు యల్లమ్మగూడెం వెళ్లిపోగా, మల్లేష్ తన ఇంట్లో ఎవరు లేని సమయం లో అదనుగా చేసుకుని రాత్రి సమయంలో తన ఇంట్లో ఫ్యాన్ కొంకెకు చిరతో ఉరీ వేసుకుని చనిపోయి ఉండగా, శుక్రవారం ఉదయం తన తమ్ముడు అయిన ఆవుల వెంకన్న చూడగా విషయం తెలిసింది. భార్య శైలజా ఇచ్చిన పిర్యాధుపై మాడ్గుల పల్లి ఎస్ఐ క్రిష్ణయ్య ధర్యాప్తు చేపట్టి, మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికీ తరలించి పోస్ట్ మార్టం నిర్వహించి, అంతిమ సంస్కారాల నిమిత్తం వారి బందువులకు మృతదేహాన్ని అప్పగించినారు. మృతునికి భార్య, ఇంటర్ చదువుతున్న ఒక కూతురు సంతానం గా కలరు.

# పటాన్చెరు నియోజకవర్గంలో పలు శుభకార్యాలలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్





**పఠాన్ చెరువు మార్చి 6 ప్రభాత సూర్య :** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన పలు శుభకార్యాలలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని ప్రజలతో సన్నిహితంగా మమేకమయ్యారు. ఇంద్రేశం పరిధిలోని సాయి కాలనీలో శ్రీనివాస్ రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ముత్తంగిలో నిర్వహించిన సాయి ముదిరాజ్ వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. తరువాత పటాన్చెరు పట్టణంలోని ఆసుపత్రి సమీపంలో ఆసుపత్రి సిబ్బంది నిర్మించిన నూతన చిన్న వినాయక ఆలయంలో నిర్వహించిన హోమ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక నాయకులు, కాలనీ నివాసులు, మిత్రులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## హోల్ సేల్ కూరగాయల వ్యాపారులు

# చిన్న వ్యాపారులను దెబ్బ తీస్తున్నారు

### హోల్ సేల్ ధరలకే కూరగాయలు విక్రయిస్తున్నారు

### కూరగాయల చిన్న వ్యాపారుల ఆవేదన



మిర్యాలగూడ, మార్చి 6:- (ప్రభాత సూర్య )మిర్యాలగూడ పట్టణంలోని నేతాజీ కూరగాయల మార్కెట్ లో హోల్ సేల్ వ్యాపారులు చిన్న వ్యాపారులను దెబ్బ తీస్తున్నారని చిన్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన కేంద్రంగా ఉంది. ఈ మార్కెట్ సుమారు 600 మంది చిరు వ్యాపారులు వారి కుటుంబ సభ్యులు (సుమారు 2500 మందికి పైగా) ప్రత్యక్షంగా జీవనోపాధి కోసం ఆధారపడి ఉన్నారు. కూరగాయలను హోల్సేల్ మార్కెట్ నుండి కొనుగోలు చేసి, చిన్న చిన్న రిటైల్ దుకాణాలు, త్రోవపై అమ్మకాలు (రోడ్డు పక్కన) ద్వారా తమ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇటీవల మార్కెట్లోని కేవలం 12 మంది హోల్సేల్ వ్యాపారులు సంఘటితంగా రాత్రి పూట ప్రత్యేక మార్కెట్ను నిర్వహిస్తున్నారు. 600 మంది చిరు వ్యాపారులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లడమే కాకుండా, కుటుంబాల పోషణే ప్రశ్నార్థకంగా మారింది.12 మంది వ్యాపారులు రాత్రి పూట తక్కువ ధరలకు కూరగాయలు విక్రయించడం వలన, మరుసటి రోజు ఉదయం వచ్చే కస్టమర్ల సంఖ్య దాదాపు 70 శాతం తగ్గిపోయిందని దీనితో రోజువారీ ఆదాయం సున్నాకు చేరుకుందన్నారు.12 మంది వ్యాపారులు హోల్సేల్ ధరలకు, అంటే కొనుగోలు చేసే ధరకే లేదా అంతకంటే తక్కువకే రాత్రుళ్ళు కూరగాయలు అమ్ముకుంటున్నామన్నారు. పూర్తిగా అన్యాయ పద్ధతని ఇలా చేయడం వలన వారు చిన్న వ్యాపారుల మీద, జీవనోపాధి మీద దాడి చేస్తున్నారన్నారు. ఉదయం కొనుగోలు చేసిన కూరగాయలు అమ్ముడుపోక మిగిలిపోయి పాడవుతున్నాయన్నారు. దీనితో రోజుకి సగటున రూ.2000 నుండి రూ.3000 వరకు నష్టపోతున్నామన్నారు. ఇలా రెండు నెలలుగా జరుగుతున్న ఈ నష్టంతో చాలామంది వ్యాపారులు అప్పుల పాలయ్యారన్నారు.12 మంది వ్యాపారుల స్వలాభం కోసం 600 మంది కుటుంబాలను (సుమారు 2500 మందిని) ఇబ్బందులకు గురిచేస్తున్నారు.12 మంది హోల్సేల్ వ్యాపారులు నిర్వహిస్తున్న రాత్రి మార్కెట్ పై వెంటనే నిషేధం విధించాలన్నారు. హోల్సేల్ వ్యాపారం ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే నిర్వహించేలా ఆంక్షలు విధించాలన్నారు. రాత్రి వేళ ఎటువంటి కూరగాయల వ్యాపారానికి అనుమతి లేదని స్పష్టం చేయాలన్నారు.

# మిర్యాలగూడ మున్సిపాలిటీలో అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## దోమల బాధలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. పందిరి అనిత డిమాండ్





**మిర్యాలగూడ మార్చి 6:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ పట్టణంలో నెలకొని ఉన్న అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై మున్సిపల్ పాలకవర్గం ప్రత్యేక సమావేశంలో పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్ పందిరి అనిత మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన మురుగు కాల్వల్లో పేరుకుపోయినదని దోమలు పెరిగి పోతున్నాయని మురుగు తొలగించే కార్యక్రమం చేపట్టాలని కోరారు. వార్డుల్లో చెత్త ఎత్త కుండా ఒక చోట వేస్తున్నారన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ కౌన్సిలర్ జావీద్ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది సక్రమంగా పని చేయడం లేదన్నారు. పారిశుద్ధ్య సిబ్బందిని మారుస్తుండాలని బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఎండి. ఇలియాస్, పెద్ది శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులు కౌన్సిలర్లు ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాలని కోరారు. ఇప్పటివరకు ప్రమాణ స్వీకారం చేయని 29వార్డు కౌన్సిలర్ జావీద్ చె కమీషనర్ శ్రీనివాస్ ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే బిఎల్ఆర్, కౌన్సిలర్లను సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్ కుమార్, కౌన్సిలర్లు మలగం రమేష్, నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి, ఫారుక్ మొహమ్మద్, ఎండి.హమీదుద్దీన్ మొయిజ్, బూడిద సైదులు, సలీం, నిషిత్ యాదవ్, మలగం రమేష్, ఆరిఫా అబ్దుల్లా, షబానా బేగం అయూబ్, షేక్ సాహేరా బేగం, పెద్ది శ్రీనివాస్ గౌడ్, శ్రీజ, బిక్షం, డిఇఇ వెంకన్న, మేనేజర్, ఆర్ఓ జి.జ్ఞానేశ్వరి, టీపిఎస్ అంజయ్య,టీపీబిఒ చరణ్, ఎఇ నవీన్, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీర్ శ్వేత పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చి06:** మెదక్ జిల్లా జిల్లా నర్సాపూర్ పట్టణంలో రంజాన్ నెల సందర్భంగా నెల రోజులపాటు ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని ఆమె అన్నారు. పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ప్రతి సంవత్సరం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు నెలరోజులపాటు నియమనిబంధనలు పాటిస్తూ అల్లా ను ప్రార్థించడంఎంతో సంతోషం అని అల్లా వారిని చల్లగా చుడాలని కోరారు.అల్లా అనుగ్రహంతో ముస్లిం సోదరులను,అదేవిధంగా నియోజకవర్గ ప్రజలందరినీ ఆయురారోగ్యాలతో , అష్టైశ్వర్యాలతో చల్లగా ఉండేలాగా చూడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ ఉమన్న గారి దేవేందర్ రెడ్డి, మెదక్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్యం గౌడ్, నర్సాపూర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, పార్టీ నర్సాపూర్ మండల అధ్యక్షుడు భోగా శేఖర్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి నగర్ వన్ లో "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమం

### దోమల నివారణపై డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి అవగాహన






**కూకట్ పల్లి,మార్చి 06 (ప్రభాత సూర్య):** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్, ఆల్విన్ కాలనీ పలు పరిధిలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి ఆదేశాల మేరకు శుక్రవారం ఎంటమాలజీ టీం దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా ఫ్రైడే డ్రై డే కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ పాల్గొనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ ఫ్రైడే డ్రై డే అనగా ప్రతి శుక్రవారం మన ఇంటి పరిసరాలలో ఉన్న నీటి నిల్వలను పూర్తిగా తొలగించి మరియు టెర్రస్ పైన ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులపై మూతలు ఉండేలాగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంటమాలజీ ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ మాట్లాడుతూ నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమలను లార్వాదశలోనే నివారించి దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ మరియు మలేరియా వంటి వ్యాధులను అరికట్టి మన ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా సూచనలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ వన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మాచర్ల విష్ణు, ప్రధాన కార్యదర్శి రఘు గౌడ్, చీఫ్ అడ్వైజర్ శ్రీ రాముల వెంకటేష్, కోశాధికారి శంకర్ రావు, సిబ్బంది ఎస్ హెచ్ జి సిబ్బంది, వాణి, అనిత,కాలనీ ప్రెసిడెంట్ విష్ణు, జనరల్ సెక్రెటరీ రఘు గౌడ్, క్యాషియర్ ఎస్ శంకర్రావు, చీఫ్ అండ్ వైజర్ శ్రీరాములు వెంకటేష్.వాణి, అనిత కమిటీ మెంబర్స్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను జాప్యం చేయొదు

### పూర్తయినా ఇండ్లకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలి.

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య



**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చి 6 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మంగాపూర్ గ్రామంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను జాప్యం చేయొదని,అలాగే నిర్మాణం చేయని వారి ఇండ్లను వెంటనే నిలుపుదల చేసి వేరే వారికి అనుమతులు ఇవ్వవలసిందిగా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సురక్షితమైన, శాశ్వత నివాస గృహాలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టంగా ఆదేశించారు.లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నారు. నిర్మాణ సామగ్రి సరఫరా, బిల్లుల చెల్లింపులు, సాంకేతిక సిబ్బంది పర్యవేక్షణ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కాసాల గ్రామ శివారులోని డిసిఎంఎస్ ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. యూరియా స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులు యూరియా కోసం యాప్ ద్వారా బుకింగ్ చేసి కొనుగోలు చేస్తున్నారా అన్న విషయాలను సొసైటీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలో సాయిల్ టెస్ట్ చేయించాలని వారికి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో హత్నూర ఎంపీడీవో శంకర్, హత్నూర డిప్యూటీ తాసిల్దార్, ఎంపీ ఓ యూసుఫ్, మంగాపూర్ సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ ఎలికట్టి భరత్



**వేములపల్లి మార్చి 06 ప్రభాత సూర్య న్యూస్ :** నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ ఎలికట్టి భరత్ శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధుల ద్వారా రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ఎలికట్టి భరత్ మాట్లాడుతూ గ్రామంలో ఇంకా సీసీ రోడ్లు లేని ప్రాంతాలను గుర్తించి దశలవారీగా రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గ్రామ ప్రజలకు రాకపోకలు సులభంగా ఉండేలా మరియు వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ రోడ్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు.రోడ్ల నిర్మాణంతో గ్రామ అభివృద్ధికి పునాది పడుతుందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం తమ లక్ష్యమని అన్నారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గంటా స్వాతి--నరసయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సతీష్, పల్లా శేఖర్, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు

# చౌటుప్పల్ పట్టణాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా

- పట్టణ పరిశుభ్రతలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి
- చౌటుప్పల్లో "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" ప్రారంభం
- మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్





**చౌటుప్పల్,మార్చి 06, ప్రభాత సూర్య :** రాష్ట్రంలో శుక్రవారం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' పేరిట 99 రోజుల కార్యాచరణను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.ప్రజాప్రభుత్వం మూడోసారి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతోంది గ్రామ, వార్డు సభలు నిర్వహించి ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరించడం..పది వారాలపాటు క్రీడలు, విద్యా,వైద్యం, సంక్షేమం, వ్యవసాయం, యువత నైపుణ్యాలు వంటి అంశాలపై విడతలవారీగా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే ప్రత్యేక విభాగం శాఖ కార్యక్రమాలపై వారోత్సవాలను ప్రభుత్వం చేపట్టనుంది." ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" పేరిట 99 రోజుల కార్యచరణలో భాగంగా శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడపల్లి గ్రామంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ వార్డు కౌన్సిలర్లు, అధికారులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు.ఐదో వార్డులో శుభ్రత కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పని చేశారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. అందరి సహకారంతో చాటుపల్ పట్టణాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో "స్వచ్ఛ చౌటుప్పల్" సాధనకై శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పట్టణ పరిశుభ్రత లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వేగంగా విస్తరిస్తున్న చౌటుప్పల్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని, అధికారులు,సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ చౌటుప్పల్ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్ తెలిపారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు, పారిశుద్ధ్య విభాగం అధికారులు,మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులచే ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ జి వెంకట్రామిరెడ్డి,ఏఎంసి చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, 20 వార్డులలోని కౌన్సిలర్లు, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పరిశీలకులు రవిశంకర్, మోగుదాల రమేష్ గౌడ్, చింతల సాయిలు, బత్తుల విప్లవ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపాలిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ భాగస్వాములై వార్డుల పరిశుభ్రతకు కృషి చేయాలి... మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్...

**ఆలేరు మార్చి 6 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీలో శుక్రవారం రోజున 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ భాగంగా పరిశుభ్రత కార్యక్రమంలో 99 కార్యచరణ ప్రణాళికలు భాగస్వామ్యం అవుతామని మున్సిపల్ కమిషనర్ కే. శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్లు వానరాసి మరియమ్మ మార్కు, మల్లెల సరిత శ్రీకాంత్, జెట్ట నిరజ సిద్దులు, బీజని కళ్యాణి మధు, పాకల మౌనిక హరీష్ , యాట శివ, పాసికంటి సంపత్, బోట్ల సంపత్, పస్తం ఆంజనేయులు, జూకంటి సంపత్ తో పాటు మున్సిపల్ మేనేజర్ జగన్మోహన్, ప్రజా ప్రతినిధులు, ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయడం జరిగింది. అనంతరం మున్సిపల్ చైర్మన్ , మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలందరూ భాగస్వాములై పరిశుభ్రతకు తోడ్పడాలని అన్నారు. పరిశుభ్రత, పరిశుద్ధం, పనులు పూర్తిస్థాయిగా నిర్వహించాలని, ప్రతి కాలనీలో చెత్త లేకుండా శుభ్రం చేయాలన్నారు. శానిటేషన్ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు , నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ లక్ష్యం.. బీర్ల అనిత.. నీలం పద్మ..





**ఆలేరు మార్చి 6 ప్రభాత సూర్య:** ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్. అంతర్జాతీయ మహిళా దినోత్సవం యాదాద్రి భువనగిరి జిల్లా మహిళ అధ్యక్షురాలు నీలం పద్మ ఆధ్వర్యంలో ఆలేరు ఇందిరా కాంగ్రెస్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణవేణి సెక్రటరీ మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం పద్మ, బీర్ల అనిత మాట్లాడుతూ దేశంలో మహిళలందరినీ ఆర్థికంగా బలోపేతం చేస్తూ మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళాల అభివృద్ధికి, మహిళల బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసి కృషి చేస్తుందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆరు గ్యారెంటీలు భాగంగా అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని, దేశంలో ఎక్కడ లేని విధంగా ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు సౌకర్యం కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మరియు అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం 500 కి గ్యాస్ సిలిండర్ గృహ అవసరాలు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మహిళా శక్తి పథకాల ద్వారా మహిళలతో క్యాంటీన్లను. పెట్రోల్ బంకులను పెట్టించడానికి ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి 2026 మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి మహిళలను కోటీశ్వరుని చేయడం తెలంగాణ రేవంతన్న లక్ష్యమని చెప్పారు . ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అనంతరం జిల్లా సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్చార్జిలు కృష్ణవేణి మౌనిక రివ్యూ మీటింగ్ నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు అందుబాటులో ఉండి ఆరోగ్యపరంగా సేవ అందిస్తున్న ఏఎన్ఎం లను. ఆశా వర్కర్లను. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లను. మున్సిపల్ మహిళ సిబ్బందిని జిల్లా కమిటీ మెంబర్లను జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ బీర్ల ఫౌండేషన్ చైర్మన్ అనిత వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ పావని , మున్సిపల్ చైర్మన్ బీజాన బాలమణి భాస్కర్, కౌన్సిలర్లు వానరాసి మరియమ్మ మార్కు మల్లెల సరిత శ్రీకాంత్ , జెట్ట నీరజ సిద్ధులు, మాజీ కౌన్సిలర్ శమంత రెడ్డి, జిల్లా కమిటీ మెంబర్స్ నీరజ ,కవిత ,పరంజ్యోతి ,పుష్ప, సిద్ధి లక్ష్మి ,మండల పట్టణ అధ్యక్షులు గ్యాదపాక దీప. మమత. రేణుక, ఝాన్సీ. పాము అనిత, డి. కవిత, శ్రీలత ,సోనీ పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



## వేం నరేందర్ రెడ్డికి ఆర్థిక శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బంద్రు శోభారాణి..

**ఆలేరు మార్చి 6 ప్రభాత సూర్య...:** భారత రాజ్యసభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన సందర్భంగా వేం నరేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించిన రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బంద్రు శోభారాణి.

## ఎత్తిపోతలకు నిరంతరం నీటి సరఫరా చేయాలి: సిపిఎం



**వేములపల్లి మార్చి 06 ప్రభాత సూర్య న్యూస్:** ఎత్తిపోతకాలకు నిరంతరం నీటి సరఫరా చేసి పంటలు కాపాడాలని సిపిఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మొలక పట్నం గ్రామం సమీపంలో ఎల్ 18, 19 ఎత్తిపోతల పథకం కింద ఎండుతున్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ సీజన్ కి ప్రభుత్వం నీటి సరఫరాలో వారబందీ నిర్వహించడం వల్ల ఎత్తిపోతల పథకాల కింద రైతులకు నష్టం కలుగుతుందన్నారు. మండలంలో గల పది ఎత్తిపోత గల పథకాల కింద విద్యుత్ సమస్యలు వల్ల చివరి భూములకు నీరందడం లేదన్నారు. ఇటీవల వార బంది నిర్వహించడం వల్ల నీటి సమస్య తీవ్రమైంది అన్నారు. ఒకపక్క ఎండలు పెరగడంతో నీటి అవసరాలు ఎక్కువయ్యాయన్నారు. వేల రూపాయలు ఖర్చుపెట్టిన వరి పంటలు పొట్ట దశలో ఉన్నాయని తెలిపారు. అధికారులు ఎత్తిపోతల పథకాల కింద చివరి భూములకు నీరు అందడంలో దృష్టి సారించకపోగా నిర్బంధంగా ఎత్తిపోతల పథకాలను ఆపివేసి సాగర్ ఎడమ కాలువ చివరికి నీటి తరలించడం సరైనది కాదన్నారు. ఎత్తిపోతల పథకాలలో ఉన్న సమస్యలపై దృష్టి సారించని అధికారులు నిర్బంధంగా నీటి తరలింపులో మాత్రం అత్యుత్సాహం ప్రదర్శించడం హాస్యాస్పదమన్నారు. ఎత్తిపోతల పథకాలకు వారబందిని ఎత్తివేసి నీటి సరఫరాను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు వల్లమల్ల ఎల్లయ్య, వ్యాకాస కార్యదర్శి రెమిడల బిక్షం, రైతులు చిలకల సైదులు, రామరాజు రంగయ్య, వల్లమల్ల వెంకన్న, బొమ్మగాని సైదులు, వెంకన్న ,నవీన్, లింగయ్య, రెమిడాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారం తీసుకోవాలి : సర్పంచ్ రమాదేవి



**మునుగోడు, మార్చి 06(ప్రభాత సూర్య):** అంగన్వాడి కేంద్రాల్లో మెనూ పాటించాలి అని సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ అన్నారు..అంగన్వాడి పోషణ మాసంలో భాగంగా మండల కేంద్రంలోని 1 , కమ్మగూడెం అంగన్వాడి కేంద్రాల్లో అన్న ప్రసాన్న కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ పాల్గొని చిన్నారులకు అన్న ప్రసన్న చేశారు. .పిల్లలకు నాణ్యమయిన భోజనం అందించాలని సూచించారు..గర్భిణీ స్త్రీలు,బాలింతలు తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు.అంగన్వాడి టీచర్లు గాలి ధనమ్మ,విక్టోరియా, చిన్నారులు,గర్భిణీ స్త్రీలు బాలింతలు పాల్గొన్నారు..



## ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ తరగతులు....



**ఆలేరు మార్చి 6 ప్రభాత సూర్య:** ఆలేరు మండలం శర్బనాపురం గ్రామంలో ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ తరగతులను శుక్రవారం రోజున ఆరుట్ల కమలాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా కుట్టు మిషన్ నేర్చుకోవడం ద్వారా స్వయం ఉపాధి సాధించడంతోపాటు కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. కుట్టు మిషిన్ ట్రైనింగ్ తర్వాత నాణ్యమైన కుట్టిన బట్టలను తయారుచేసి ప్రజలకు అందించడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో ఈ కుట్టు మిషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, గ్రామ సర్పంచ్ మొగులుగాని నరసయ్య, ఉప సర్పంచ్ సైదాపురం మౌనిక సురేష్, వార్డు సభ్యులు కందుల మధు, కారే రాజు, సిరిగిరి నవీన్, కందుల వినోద్, మరియు వి వి కే మొగలుగాని యమునా మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ అంకమ్మ మహాలక్ష్మమ్మ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవస్థానం శ్రీ త్రిశక్తి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన





**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి):** ఖమ్మం నగరం 4వ డివిజన్ ఇండస్ట్రియల్ ఏరియా కైకొండాయిగూడెం రోడ్ ఖానాపురం అంకమ్మ మహాలక్ష్మమ్మ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవస్థానం శ్రీ త్రిశక్తి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఎంతో భక్తిశ్రద్ధలతో మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమ్ము భాస్కర్ రావు – కుసుమ దంపతులు కోశాధికారి గుండోజు రామారావు కార్యదర్శి రెడ్డి బోయిన వరలక్ష్మీ ఉపాధ్యక్షులు దంతాల కేశవులు రెడ్డిబోయిన వెంకటేశ్వర్లు యలమందల రామారావు ప్రచార కార్యదర్శి కేశోత్ సుందర్ కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళ జనార్ధన చారి సలేంద్ర మురళీధర చారి నార్ల మల్సూరు బూడిగె కృష్ణ కోరు బోతుల అవినాష్ రెడ్డి రఘుతేజ మామిడి మాధవి ఎలమందల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన

### ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మెగా వైద్య శిబిరం నిర్వహణ .. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రమా మణి






**ప్రభాత సూర్య నర్సాపూర్ మార్చి 06 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రమా రమణి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం ఆరోగ్య శాఖలోని 10 శాఖలకు సంబంధించిన డాక్టర్లతో నిర్వహించామని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ రమామణి తెలిపారు. ఈ కార్యక్రమం దౌల్తాబాద్ సర్పంచ్ వావిలాల సంగీత నరసింహులు, ఉప సర్పంచ్ శేఖర్ గౌడ్, వార్డు మెంబర్లు ఇతరుల సహాయ సహకారముతో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ ఆరోగ్య శిబిరానికి జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రం నుండి వైద్యుడు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశాంక్ హాజరయ్యారని తెలిపారు. అదేవిధంగా జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ కూడా హాజరై పర్యవేక్షణ చేశారని అన్నారు. ఈ వైద్య శిబిరానికి దౌల్తాబాద్ పట్టణంలోని ప్రజలు భారీగా హాజరై తమ తమ ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం వైద్యులతో తెలియజేసి తగిన మందులు తీసుకున్నారని డాక్టర్ రమామణి తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వివిధ విభాగాలలో నిపుణులైన వైద్యులు పాల్గొన్నారు. స్త్రీ వైద్య నిపుణులు శాలిని రెడ్డి, ఫిజీషియన్ డాక్టర్ సురేష్, డాక్టర్ రుచిక రెడ్డి, ఆర్థోపెడిక్ డాక్టర్ హరీష్ శంకరన్, చిన్నపిల్లల వైద్యులు నూర్, డెంటల్ డాక్టర్ పద్మశ్రీ, పై నిపుణులు వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలను పరీక్షించి చికిత్స చేయడం జరిగిందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది ఎమ్మెల్ హెచ్ పి లు డాక్టర్ హిమబిందు, డాక్టర్ మనిషా, పిహెచ్సి సిబ్బంది ఉమాకాంత్, ప్రభాకర్,జగదీష్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది,తదితరులు హాజరయ్యారు.

## నలుగురి మరణానికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష

**మిర్యాలగూడ , మార్చి 6:- (ప్రభాత సూర్య):** వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి నలుగురి మరణానికి కారకుడైన షేక్ రంజాన్ కు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ స్థానిక ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కెవి చంద్రశేఖర్ రావు శుక్రవారం తీర్పు నిచ్చారు. 2021లో పెద్దవురా మండలం తెప్పలమడుగు గ్రామానికి చెందిన తరీ శ్రీను భార్య, ఇద్దరు పిల్లలతో వస్తుండగా నిడమనూరు మండలం కేంద్రం కోర్టుకు ఎదురుగా అజాగ్రత్తగా వాహనం నడిపి ఢీ కొనడంతో నలుగురు మరణించారు నిడమానూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఎపీపీ సి. రఘురామరావు వాదించారు.





## డిడియూ -జికేవై - రిటైల్ సేల్స్ అసిస్టెంట్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

### ఖమ్మం మహిళా ప్రాంగణం అధికారిని వేల్పుల విజేత

**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)టేకులపల్లి ఖమ్మం నందు నిరుపేద అనాథ ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు వివిధ కోర్సుల యందు శిక్షణ ఇవ్వబడును. ఇందులో భాగంగా నూతనంగా రిటైల్ అండ్ సేల్స్ అసిస్టెంట్ ప్రోగ్రామ్ ను ప్రారంబించ బడుతున్నట్లు మహిళా ప్రాంగణం అధికారిని వేల్పుల విజేత ఒక ప్రకటనలో తెలియపరిచారు.రిటైల్ అండ్ సేల్స్ అసిస్టెంట్ ప్రోగ్రామ్ అనేది దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన కింద ఒక నైపుణ్య శిక్షణ. ఇది గ్రామీణ యువతను రిటైల్ రంగంలో అవసరమైన నైపుణ్యాలతో సన్నద్ధం చేయడానికి రూపొందించబడింది.ఈ శిక్షణ పూర్తిగా ఉచితం. 100% ఉద్యోగ నియామక మద్దతును అందించడంపై దృష్టి పెడుతుంది మరియు సాఫ్ట్ స్కిల్స్ ఐటి మరియు ఆంగ్లంలో శిక్షణను కలిగి ఉంటుంది.

**అర్హతా వివరాలు**

10వ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలి.18 – 35 సంవత్సరముల వయస్సు కలిగిన వారై ఉండాలి.3 నెలల కాల పరిమితి.ఉచిత భోజన సౌకర్యంతో పాటు హాస్టల్ వసతి కూడా కల్పించబడును.ఖమ్మం జిల్లా మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళలు ఇట్టి అవకాశమును సద్వినియోగించుకోగలరు.దరఖాస్తుతో పాటు రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోస్ ఆధార్ కార్డు 10వ తరగతి మర్కు మెమో మరియు ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు జిరాక్సులు జతపరచవలెను. శిక్షణానంతరము ప్రభుత్వామోదితమైన సర్టిఫికెట్ ఇవ్వబడును దరఖాస్తులు ఇవ్వవలసిన వారు మరియు ఇతర వివరములకు కార్యాలయ పనిదినములో ఉ|| 10.30 నుండి సా|| 5.00 లోపు మహిళా ప్రాంగణం ఆఫీసు నందు సంప్రదించగలరు. లేదా ఫోన్ నెంబర్ 7660022512, 7660022513 నందు సంప్రదించగలరు.

## తిరుమలలో బర్త్‌డే సెలబ్రేషన్స్

### దివ్వెల మాధురి,తనూజలపై చర్యకు టిటిడి ఆదేశం

తిరుమల: తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న దివ్వెల మాధురి, బిగ్ బాస్ ఫేమ్ తనూజ పుట్టస్వామిలపై చర్యలకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమైంది. ఈ వ్యవహారంపై విజిలెన్స్ పోలీసులకు టీటీడీ ఫిర్యాదు చేసింది. తిరుమలలో ఈ తరహా వేడుకలు పూర్తిగా నిషేధమని టీటీడీ ఈ సందర్భంగా పేర్కొంది. ఈ పుట్టిన రోజు వేడుకలను చిత్రీకరించి.. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై అభ్యంతరం తెలిపింది. టీటీడీ ఇచ్చిన ఫిర్యాదుపై విజిలెన్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తిరుమలకు కేక్ తీసుకు వచ్చి.. కట్ చేయడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని విజిలెన్స్‌కు ఇచ్చిన ఫిర్యాదులో టీటీడీ స్పష్టం చేసింది. గతంలోనూ తిరుమలలో దివ్వెల మాధురి, దువ్వాడ శ్రీనివాస్ రీల్స్ చేశారు. దీనిపై విజిలెన్స్ పోలీసులకు టీటీడీ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తిరుమలలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఆ సమయంలో టీటీడీ హెచ్చరించింది. ఆ తర్వాత పలువురు ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే.. వారిపై టీటీడీ చర్యలు కూడా తీసుకున్న విషయం విదితమే. ఇటీవల యూట్యూబర్ గీతూ రాయల్ సైతం తిరుమలలో రీల్స్ చేశారు. దీనిపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా దివ్వెల మాధురి, తనూజ పుట్టస్వామి జన్మదిన వేడుకలపైనా భక్తులు మండిపడుతున్నారు.

## గల్ఫ్‌కు వెళ్లే 12 విమానాలు రద్దు

హైదరాబాద్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన 12 విమానాలు రద్దయ్యాయి. అదే సమయంలో గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన మరో 12 విమానాలు కూడా రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన, వెళ్లాల్సిన విమానాలు రద్దు అయినట్లు అధికారులు తెలిపారు.

## మూడు వారాల్లో క్యాతన్ పల్లి ఎన్నిక

### ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అర్ధంతరంగా నిలిచిపోయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా.. ఇటీవల బెయిల్ మంజూరు అయింది. అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కేతనపల్లిలోని తన నివాసంలో బాల్క సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను జైల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు.

## ఈ యుద్ధంతో ఆర్థిక సంక్షోభం తప్పదా?

**వరుస యుద్ధాలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్తను అతలాకుతలం చేస్తున్నాయి. భారత్ లాంటి పేదదేశం మరింత కుంగిపోయేలా చేస్తోంది. కరోనాతో మొదలైన దాడి ఇప్పుడు గల్ఫ్ యుద్ధంతో తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్పై ఇజ్రాయిల్, అమెరికాల దాడితో చమురుత సంక్షోభంతో దారుణ పరిస్థితి మొదలు కానుంది. ఇది తరవాత క్రమంగా నిత్యాసవరాలు, కూరగాయలు, మందులపై పడనుంది.**

అన్నింటికీ మూలం చమురు కనుక ఈ యుద్ధంతో చమురు సంక్షోభం తప్పేలా లేదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ఈ యుద్ధంతో చమురు ధరలు కొండెక్కి.. వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం భారీగా పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన కలుగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై ఈ యుద్ధ ప్రభావం తోణమే ప్రారంభమవుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఈ సెగ సామాన్యులకు కూడా త్వరగానే తగలబోతోంది. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం ద్వారా సరుకు రవాణా ఆగిపోవడం ఖాయం అయ్యింది. ఏతావాతా అది మన జేబులు చల్లుపెట్టడం, ధరలపై ప్రభావం చూపడం తద్వారా మన వంటింటికి కూడా తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందనడంలో సందేహం లేదు. మనకు అవసరమైన సోయా, సన్ ఫ్లవర్ వంటి వంట నూనెలు, పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనా, బ్రెజిల్, అమెరికా నుంచి సోయా ఆయిల్, ఉక్రెయిన్, రష్యాల నుంచి సన్ ఫ్లవర్ ఆయిల్ దిగుమతవుతున్నాయి .వంట నూనెలను తీసుకొచ్చే నౌకలు సూయజ్ కెనాల్, హోర్ముజ్ జలసంధి మీదగా రావాలి. ఇరాన్ ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని మూసి వేసింది. దీంతో వీటిని తీసుకొచ్చే నౌకలు మరింత దూరం ప్రయాణించి మన రేవులకు చేరాలి. దీంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి ధరల పెరుగుదల మీద తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే ముడిచమురు దిగుమతుల ప్రభావం వల్ల వంట గ్యాస్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. మనదేశం ప్రతి ఏటా 5–6 మిలియన్ టన్నుల మేర కందిపప్పు, పెసరపప్పు వంటి పప్పు ధాన్యాలను మయన్మార్, కెనడా, ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకుంటోంది. నిజానికి మనదేశంలో పప్పు దినుసులు విపరీతంగా పండుతున్నా ఎందుకనో దిగుమతులు చేస్తున్నాం. వీటిని దేశీయంగా పండిస్తున్నా ధరలు రావడం లేదు. రైతులను ప్రోత్సహించడం లేదు. కందులు, సోయా అమ్ముకోలేక ఏటా రైతులు నానా యాతన పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ సందర్భంగా అయినా దేశీయ పంటలను ప్రోత్సహిస్తే మంచిది. పప్పులు, నూనె ధాన్యాలకు మన నేలలు అనుకూలం. ఇకపోతే ఇరాన్ ఆంక్షలతో హోర్ముజ్ జలసంధి స్థంభించిన కారణంగా వీటిని తీసుకొచ్చే నౌకలు కూడా మరో మార్గంలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఫలితంగా రవాణా ఖర్చులు, బీమా ఖర్చులు భారీగా పెరిగి వాటి ప్రభావం రిటైల్ కొనుగోలుదారులపై పడుతుంది. అలాగే మనం వాడే జీడిపప్పు, పిస్తా, ఎండు ద్రాక్ష, ఆప్రికాట్ వంటి డ్రైఫ్రూట్స్, నట్స్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదముంది. వీటిని ఎక్కువగా ఇరాన్, అఫ్గానిస్థాన్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇరాన్ యుద్ధంలో తలమునకలై ఉంది. మరోవైపు అఫ్గనిస్థాన్ కూడా పాకిస్థాన్‌తో తలపడుతోంది. ఈ నేపథ్యంలో వీటి దిగుమతులు కూడా ప్రభావితమవుతాయి. హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు తొలగితే కొంత ఊపిరిపీల్చుకోగలుగుతారు. నిజానికి దేశంలో పంటలు పండుతున్నా దిగుమతులు విపరీతంగా చేసుకుంటున్నాం. దిగుమతులపై ఆంక్షలు విధిస్తే దేశీయంగా మన ఉప్పులు, పప్పులు కొనుగోలు చేసుకోవచ్చు. రైతులను ఈ దిశగా ప్రోత్సహించే చర్యలు కరువయ్యాయి. దిగుమతుల దాడుల కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలతో పాటు భారత్‌నూ పేదరికం పట్టి పీడిస్తోంది. 147కోట్ల దేశ జనాభాలో నేటికీ 28 శాతం మంది పేదరికంలోనే మగ్గుతున్నారని ఇటీవలి అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్ పేద దేశం కాదని, భారతీయులే పేదవారనే అభిప్రాయం ఉంది. పాలకుల దృష్టి లోప కారణంగా మనదేశంలో పేదలు ఎదగడం లేదు. నిత్యావసరాలు వారికి అందడం లేదు. ఔషధాల ధరలు విపరీతంగా పెరిగాయి. విద్య, వైద్యం అందకుండా పోతోంది. వీటి గురించి పాలకులు ఆలోచన చేయడం లేదు. ఇప్పుడు యుద్ధం పుణ్యమా అని అన్న రకాల వస్తువుల ధరలు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. డబ్బున్న పాలకులు ఉండడం వల్ల వారికి పేదరికం అర్థం కావడం లేదు. పేదరికం సామాజిక రుగ్మతగా గుర్తించడం లేదు. ఆకలి, జీవన ఒత్తిళ్లు ఒక కుటుంబాన్ని ఎలా నిస్తేజంగా మార్చుతాయో, నిశ్శబ్దంగా వారి ప్రాణాలనే ఎలా మింగేస్తున్నాయో ఆయా సందర్భాల్లో జరుగుతున్న అనేకానేక ఆత్మహత్యలు ధృవీకరిస్తున్నాయి. బ్రిటిష్ పాలన నాటికంటే ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. దేశ సంపదలో సగానికి పైగా సంపద కేవలం 10శాతం మంది కుబేరుల దగ్గర పోగయ్యింది. మోడీ పాలనలో రూపాయి విలువ చరిత్రలో కనివిని ఎరుగనంత పతనావస్థకు దిగజారింది. పేదలు మరింత పేదలుగా కావడానికి, మధ్య తరగతి వర్గం పేదరికంలోకి జారిపోవడానికి ప్రధానకారణం వ్యవసాయ క్షీణత, నిరుద్యోగం, విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారడం అని నిపుణులు చెబుతున్నారు. ఈ దశలో మనం సంస్కరణలకు దిగాలి. ఆహారా ధాన్యాల దిగుమతులను తగ్గించుకోవాలి.



## అనిశ్చితిలో ఇరాన్ భవితవ్యం

అమెరికా యుద్ధ దాహానికి ప్రపంచం వణుకుతోంది. బడిత ఉన్నోడిదే బర్రె అన్నచందంగా అమెరికా తన ఆయుధాలతో ప్రపంచాన్ని బెదిరిస్తోంది. దారికి రాని వారిపై దాడికి తెగిస్తోంది. మొన్న వెనిజువెలా, ఇప్పుడు ఇరాన్ దేశాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ దేశాల్లో అస్థిరతను సృష్టించడం, తమ దారికి తెచ్చుకో వడం అలవాటుగా చేసుకుంది. ఆయుధాలు లేదా, సుంకాలతో బెదరిస్తోంది. భారత్‌ను కూడా ఇదే తరహాలో ఇబ్బందులు పెడుతోంది. తాజా యుద్ధంతో భారత్ తన వ్యూహాలను మార్చుకోవాలి. స్వతహాగా ఆలోచన చేయాలి. గతంలో ఇరాక్‌ను ధ్వంసం చేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌ను తుదముట్టిం చింది. రేపు ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇది నయా నియంతల కాలంగా మారింది. ఓ వైపు అమెరికా, మరోవైపు ఇజ్రాయిల్ కలసి ఆడుతున్న యుద్ధంలో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టేలా ఉంది. అయితే ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా హమాస్, హిజ్బుల్ సంస్థలను ప్రోత్సహించి ఇజ్రాయిల్ పతనాన్ని కోరుకుంది. ఇరాన్‌ను అభివృద్ధి చేసుకునే పనిని వదిలి ఇజ్రయిల్‌తో పంతం పెట్టుకుంది. అణు కార్యక్రమాలను విస్తరించుకుంది. అదే ఇప్పుడు ఖమేనీ పతనానికి దారితీసింది. దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్ర నాయకుడు ఖమేనీ..ప్రత్యర్థి దాడిలో సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరయడం లేదు. ఎందుకంటే కొన్ని నెలలుగా ఖమేనీ కదలికలపై దృష్టి పెట్టిన అమెరికా, ఇజ్రాయెల్ మట్టుపెట్ట గలిగాయి. ఆధునిక సాంకేతికతో ఖమేని ప్రాంతాన్ని గుర్తించి దాడి చేసారు. అమెరికా దాడులు దాదాపు ఖాయమని కొద్ది రోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. అమెరికా అందించిన రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి. ఈ క్రమంలో ఇరాన్ భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఇరాన్ తన ఛాందసవాద పంథాను వీడాలి. ఉగ్రవాదులను ప్రోత్సహించి, ఇతర దేశాలపై పురిగొల్పే విధానాల నుంచి తప్పుకోవాలి. ప్రజలంతా ఎవరికి తోచినట్లు వారు బతికేలా చేసుకోవాలి. పాకిస్తాన్ కూడా ఇలాగే ఉగ్రవాదులను ఎగదోస్తూ వచ్చింది. చివరకు సహనం నశించిన భారత్ ఆపరేషన్ సిందూర్‌తో దాడులు చేసింది. అయితే చావుతప్పి కన్ను లొట్టపోయి నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి మారింది. అఫ్గాన్‌తోఓ కయ్యానికి దిగింది. ఇది దేశాన్ని అతలాకుతలం చేస్తుందన్న విషయం గుర్తించడం లేదు. ఇక ఇరాన్ కూడా ఛాందసవాద భావాలతో రగిలిపోతోంది. ఖమేనీ రాకతో ఇరాన్ మళ్లీ మతఛాందసవాదంలోకి నెట్టబడింది. అక్కడ ప్రజలు ఇటీవలే ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ దాడుల్లో వేలాదిమంది హతం అయ్యారు. అంతర్గతంగా కూడా ఇరాన్ నాయకత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో అమెరికా కూడా పాచిక వేసి ఖమేనీని మట్టు పెట్టింది. గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది. ఖమేనీ కదలికలపై అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని సీఐఏ.. ఇజ్రాయెల్‌తో పంచుకుంది. ఆ వెంటనే ఇంటెలిజెన్స్, సైనిక ప్రణాళికపై కసరత్తు మొదలైంది. ఖమేనీ భేటీ శనివారం సాయంత్రం ఉండొచ్చని తొలుత అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భావించాయి. అయితే ఆ సమావేశం ఉదయమే జరుగుతున్నట్లు చివరి నిమిషంలో ఇజ్రాయెల్ నిఘా అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయమే టెహ్రాన్‌పై విరుచుకుపడాలని నిర్ణయించు కున్నారు. ఖమేనీపై దాడితో యుద్ధాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. పోరు మొదలయ్యాక ఆయన బంకర్‌లో తలదాచుకోవచ్చన్న భావనకు అమెరికా, ఇజ్రాయెల్‌లు వచ్చాయి. ఆ సమయంలో ఇరాన్ జాతీయ భద్రతా అధికారులు ఒక భవనంలో.. ఖమేనీ మరో భవనంలో ఉన్నారు. అయినా ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించి నట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు భవిష్యత్ ఏంటన్నది ఇరాన్ ఆలోచించాలి. ఇరాక్ పతనమైనట్లే ఇరాన్ కూడా పతనమవుతుందా లేక లేచి నిలబడుతుందా అన్నది చూడాలి. ఆయుధ పోటీలో ఇప్పుడు ఈ యుద్ధం పరాకష్టగా చూడాలి. ఇరాన్ ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోన తదుపరి నాయకత్వం చేయాలి. ప్రపంచ దేశాల్తో తనకుంటూ స్థానాన్ని పదిలం చేసుకోవాలి. ఎందుకంటే ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే– ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉండటమే అందుకు కారణం.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.